క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామి కల్యాణం


స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి కల్యాణం దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం వైభవంగా జరిపించారు. ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, గోత్రనామార్చనలు ,పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలను జరిపించారు. అనంతరం స్వామి వారి కల్యాణాన్ని మేళతాళాల మధ్య ఆలయ ప్రధానఅర్చకుడు ప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిపించారు. స్వామి వారి పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, కల్యాణాన్ని తిలకించారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. మండల వ్యాప్తంగా దసరా వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. స్వామి వారి పూజ కార్యక్రమాలలో ఆలయ మేనేజర్ రమణ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

చర్లరూరల్: మండలంలోని కుదునూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన సుమారు 100 కుటుంబాల వారు బీఆర్‌ఎస్‌లో చేరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పసథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీకి వస్తున్నారని మండల అధ్యక్షుడు సోయం రాజారావు అన్నారు. కార్యక్రమంలో బొలిశెట్టి రంగారావు, రమేశ్‌గౌడ్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోలిన లంకరాజు, ఎంపీపీ కోదండరామయ్య, ప్రచార కార్యదర్శి కొటేరు శ్రీనివాసరెడ్డి, రైతు బంధు సమితి మండల కన్వీనర్ కొసరాజు రాజా, యూత్ అధ్యక్షుడు కాకి అనిల్, కుదునూరు ఎంపీటీసీ కుంజద నాగేశ్వరరావు, సర్పంచ్ కుంజా కమల, చర్ల మాజీ ఎంపీటీసీ అలం ఈశ్వర్, తేగడ ఉపసర్పంచ్ శ్యామల శివ, కేశవపురం ఉపసర్పంచ్ గోసుల మురళీ, యూత్ కార్యదర్శి నెర్రబోయిన చంద్రశేఖర్, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఐక్యరాజ్య సమితి దినోత్సవం

బూర్గంపాడు: ఐక్యరాజ్య సమితి ఏర్పాటు దినాన్ని పురస్కరించుకుని మంగళవారం సోంపల్లి గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అంజనాపురంలోని జీకేఎఫ్ ఆగ్రో ఫారెస్ట్రీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా.. ప్రతి ఇంటికీ మొక్కలు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల మధ్య శాంతి భద్రతలు, ఆర్థిక, శాస్త్రసాంకేతిక సంబంధాలను పెంపొందించి మానవళికి మంచి చేసేందుకు ఐక్యరాజ్య సమితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రజియా బేగం, లలిత, సరస్వతి, సౌమ్య, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు


ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బతుకమ్మలు

దమ్మపేట: మండల పరిధిలోని ముష్టిబండ గ్రామ శివారులో ఉన్న దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ రావు గంగాధర రావు ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వందలాదిగా మహిళలు, యువతులు పాల్గొని బతుకమ్మలను ఆలయ ప్రాంగణంలో ఉంచారు. అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయమంతా విద్యుత్ దీపాలతో అలంకరించి, డీజే సౌండ్ సిస్టంను ఏర్పాటు చేశారు. మహిళలు, యువతులు, చిన్నారులు బతుకమ్మ ఆటపాటలతో కోలాటం ఆడారు. అనంతరం బతుకమ్మలను, ఆలయ సమీపంలోని కోనేరులో వదిలారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆలయ శంకుస్థాపన

దమ్మపేట: శ్రీరంగనాథ స్వామి ఆశ్రమం ఆధ్వర్యంలో, నూతనంగా నిర్మించనున్న సాయి బాబా ఆలయానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం ముష్టిబండ గ్రామ శివారులోని రంగనాథస్వామి ఆశ్రమం ఆధ్వర్యంలో సాయిబాబా ఆలయ నిర్మాణం కోసం శంకుస్థాపన కార్యక్రమాన్ని వేదపండితుల సమక్షంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయదశమి

నియోజవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో సోమవారం దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. పర్వదినాన్ని పురస్కరించుకుని బంధువుల రాకతో గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపించింది. దేవాలయాలు భక్తులతో పోటెత్తాయి. సాయంత్రం వేళ ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన జమ్మి కొమ్మకు శాస్త్రోక్తంగా శమీ పూజలు చేశారు. భక్తుల కోలాహలం నడుమ నరకాసుర వధ చేశారు. మరోవైపు పోలీసులు ఆయుధ పూజలు చేపట్టారు. ఇనుము పనిముట్లతో వృత్తులను నిర్వహించే మెకానిక్‌లు వంటివారు కూడా తమ పనిముట్లకు పూజలు చేయించారు.

– సాక్షి నెట్‌వర్క్


దుమ్ముగూడెం: పర్ణశాలలో శమీ పూజ నిర్వహిస్తున్న అర్చకులు


కరకగూడెం: అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ రేగా, కుటుంబ సభ్యులు


మణుగూరుటౌన్: పీవీకాలనీలోని రామ్‌లీలాలో దహనానికి సిద్ధం చేసిన రావణుడి ప్రతిమ


మణుగూరుటౌన్: సింగరేణి వేడుకలకు హాజరైన కార్మిక కుటుంబాలు


ములకలపల్లి: జమ్మి కొమ్మకు పూజలు చేస్తున్న భక్తులు


మణుగూరురూరల్: ఆయుధ పూజ చేస్తున్న డీఎస్పీ రాఘవేంద్రరావు, ఇతర సిబ్బంది


భద్రాచలంటౌన్: వేణుగోపాల స్వామి ఆలయంలో శమీ పూజ నిర్వహిస్తున్న అర్చకులు


అశ్వారావుపేటరూరల్: కొత్త మామిళ్లవారిగూడెంలో అమ్మవారిని దర్శించుకుంటున్న మహిళలు


అశ్వాపురం: పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజలో సీఐ రవీందర్, ఎస్సైలు సురేష్‌కుమార్, తిరుపతిరావు


మణుగూరుటౌన్: సింగరేణి ఆధ్వర్యంలో సాంస్కృతిక నృత్యాలు

గెలిపిస్తే మంత్రిగా వస్తా..

దమ్మపేట: రానున్న ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలందరూ తనను గెలిపిస్తే.. మంత్రిగా తిరిగొస్తానని స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అశ్వారావుపేట నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులు చూసి తనకు ఓటెయ్యాలని కోరారు. మంగళవారం అశ్వారావుపేట బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే దమ్మపేట గ్రామంలో ప్రచారం నిర్వహించారు. అంతకుముందుగా ముష్టిబండ గ్రామ శివారులో ఉన్న దుర్గామల్లేశ్వరస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం దమ్మపేట గ్రామంలోని మల్కారం వీధిలో, బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ, విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు


దమ్మపేటలో బీఆర్‌ఎస్ మేనిఫెస్టో కరపత్రాన్ని పంచుతున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

రావు జోగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు పైడి వెంకటేశ్వరరావు, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు దారా యుగంధర్, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు దొడ్డాకుల రాజేశ్వరరావు, యార్లగడ్డ బాబు, పగడాల రాంబాబు, సైదా, అబ్దుల్ జిన్నా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థి పర్యటన

దుమ్ముగూడెం: బీఆర్‌ఎస్ పార్టీ భద్రాచలం నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు మంగళవారం దుమ్ముగూడెం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ముందుగా మండంలోని నడికుడిలో ఉన్న శ్రీ కాళికా చాముండేశ్వరి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మారాయిగూడెంకు చేరుకుని.. స్థానిక 10 కుటుంబాల వారు, ఆటో యూనియన్‌కు చెందిన 15 కుటుంబాల వారు పార్టీలో చేరగా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం బీమవరం మీదుగా లచ్చిగూడెంకు చేరుకుని సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి, ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు తెల్లం సీతమ్మ, ఎంపీటీసీ సభ్యులు సోడి తిరుపతిరావు, మడకం రామారావు, పూనం ధర్మరాజు, సర్పంచ్‌లు ఇర్పా చంటి, కల్లూరి రజని, గుండి వెంకటేష్, తెల్లం రామకృష్ణ, సరియం సీతారామరావు తదితరులు పాల్గొన్నారు.

బాబావారికి పుణ్యతిథి వేడుక

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం జూనియర్ కళాశాల సెంటర్‌లోని శ్రీసాయిబాబా వారి మందిరంలో విజయదశమి సందర్భంగా మంగళవారం షిరిడి సాయిబాబా వారి పుణ్యతిథి వేడుక, మహాసమాధి చెందిన రోజును వైభవంగా నిర్వహించారు.

ఈ క్రమంలో బాబావారికి పాలాభిషేకం, నూతన వస్త్రాలంకరణ, స్వర్ణాభరణాలధారణ, పుష్పాలంకరణ వంటి కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబావారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాబావారి ఆలయంలో ప్రతి గురువారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి పట్టణానికి చెందిన నాగ సాయిరాణి, విరాజిత రూ.20 వేలు విరాళాన్ని ఆలయ కోశాధికారి కుంచాల రమేష్‌కు అందజేశారు. ఆలయ అధికారులు దాతలకు రశీదును అందజేశారు.

క్రీడలతో చెడు వ్యసనాలకు దూరం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ రాజగోపాల్

చర్ల: క్రీడలతో యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటుందని, ప్రతీ యువకుడు ఏదో ఒక క్రీడను అలవాటు చేసుకోవాలని చర్ల సీఐ బి.రాజగోపాల్ అన్నారు. మండల కేంద్రంలోని చర్లలో ఉన్న గడీంకోట క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలంటే క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఆయన అన్నారు. చర్లలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీల్లో ఎటువంటి వివాదాలకూ చోటు చేసుకోకుండా విజయవంతంగా నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇర్పా శాంత, ఎంపీటీసీ సభ్యురాలు మడకం పద్మజ, రైతుక్లబ్ చైర్మన్ కొత్తపల్లి ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ, సుందర సురేష్, కారంపూడి సాల్మన్‌రాజు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు దొడ్డి తాతారావు, కొసరాజు రాజా, తడికల లాలయ్య, తోటమల్ల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు సరికాదు

అశ్వాపురం: బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త మరణిస్తే మరణించడంతో ఆ కుటుంబానికి ఎమ్మెల్యే రేగా కాంతారావు బీమా చెక్కు పంపిణీ చేస్తే.. ఎన్నికల నియమావళి ఉల్లంఘన అంటూ కొందరు నాయకులు ఆరోపణలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ అన్నారు. అశ్వాపురంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ కార్యక్రమాలకు, ప్రభుత్వ కార్యక్రమాలకు తేడా ఏంటో కూడా అవగాహన లేకుండా కొందరు ఇష్టారాజ్యంగా ఎమ్మెల్యే రేగాపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

అసోసియేషన్ సభ్యుల ఎన్నిక

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డివిజన్ కమిటీల్లో ఇటీవలే ఖాళీ అయిన సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో డివిజన్ కమిటీ ఉపాధ్యక్షుడిగా ఎస్.రాజబాబు, కార్యవర్గ సభ్యుడిగా బి.రాజును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికై న సభ్యులు మాట్లాడుతూ.. డివిజన్‌లో అసోసియేషన్ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బంధు వెంకటేశ్వరరావు, కేఎస్ఎల్వీ ప్రసాద్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామంలో పల్లపు మల్లయ్య, సాధిని రాఘవులు మృతి చెందగా.. కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం వారి వారి ఇళ్లకు వెళ్లి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం వారి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ.. వారి కుటుంబాలను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో ఉపసర్పంచ్ గోరంట్ల కనకయ్య, తమ్మిశెట్టి సాంబ, బాడిశ నాగేశ్వరరావు, సాధిని శంకర్, కుర్రి నారాయణ, పానగంటి రవి, ముత్తయ్య, మైబూబ్ పాషా తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

చర్ల: అనారోగ్యంతో బాధపడుతున్న యువతి కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు ఆర్థిక సాయం అందించారు. చర్ల మండలంలోని ఆర్ కొత్తగూడెంలోని ఆకుల పూజిత టకాయస్ అరిటైటీస్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతుండగా, తండ్రి పక్షవాతం బారిన పడి మంచానికి పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు చీమకుర్తి వీరభద్రం, చీమలమర్రి మురళీకృష్ణ మంగళవారం కుటుంబాన్ని పరామర్శించి రూ.20 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అల్లి విద్యాసాగర్, బాలు, సతీష్, పెద్దిరెడ్డి, సుధాకర్, సంతోష్, భద్రయ్య, విజయ్, కృష్ణార్జునరావు పాల్గొన్నారు.

లక్కును పరీక్షించుకోండి!

- దసరా నేపథ్యంలో ఆర్టీసీ లక్కీ డ్రా
- పది మంది విజేతలు.. ఒక్కొక్కరికి రూ.9,900 బహుమతి
- ఈ నెల 28 నుంచి 30 వరకు చాన్స్..

భద్రాచలంఅర్బన్: బస్సుల్లో ప్రయాణికుల ఆక్యూపెన్సి శాతాన్ని మరింత పెంచుకునేలా ఆర్టీసీ సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా పండుగ రోజుల్లో వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు చూరగొంటోంది. గత నెలలో రాఖీ పౌర్ణమి సందర్భంగా మహిళా ప్రయాణికుల కోసం లక్కీడ్రా చేపట్టారు. భద్రాచలం ఆర్టీసీ డిపో పరిధిలో చర్ల, వెంకటాపురం, భద్రాచలం బస్ స్టాండ్లల్లో ప్రత్యేక లక్కీ డ్రా బాక్స్‌ను ఏర్పాటు చేయగా విశేష స్పందన లభించింది. ఆగస్టు 30, 31 మహిళా ప్రయాణికుల కోసం లక్కీడ్రా బాక్స్ ఏర్పాటు చేశారు. మహిళలు తాము ప్రయాణించిన టికెట్లపై పేరు, మొబైల్ నంబర్ రాసి బాక్సుల్లో వేయగా రీజియన్ స్థాయిలో లక్కీడ్రా నిర్వహించారు. డ్రాలో భద్రాచలం డిపో పరిధి నుంచి ఎవరి పేరు కూడా డ్రాలో రాలేదు. రాఖీ అనంతరం ఇప్పుడు దసరా పండుగకు ప్రయాణికులకు జిల్లా వ్యాప్తంగా లక్కీడ్రా నిర్వహిస్తున్నారు.

లక్కీడ్రాలో ఎలా పాల్గొనాలి?

ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు, 28 నుంచి 30 తేదీల్లో బస్సుల్లో ప్రయాణించే వారందరూ ఈ లక్కీడ్రాలో పాల్గొనవచ్చు. ఆయా తేదీల్లో ప్రయాణం పూర్తయ్యాక టికెట్ వెనకాల పేర్లు, ఫోన్ నంబర్ రాసి బస్టాండ్లలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌లో వేయాలి. జిల్లాలో ఎక్కడ ప్రయాణం చేసినవారైనా పరవాలేదు. 30వ తేదీ అనంతరం ఆర్టీసీ అధికారుల నిర్ణయం మేరకు ఓ రోజు రీజియన్ మేనేజర్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా తీస్తారు. డ్రాలో రీజియన్ నుంచి ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలను ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.9,900 చొప్పున బహుమతులు అందజేస్తారు. డ్రాలో మీ పేరు వస్తే టికెట్ వెనుక రాసిన నంబర్‌కు ఆర్టీసీ అధికారులే కాల్ చేసి బహుమతి అందజేస్తారు.


భద్రాచలం బస్‌స్టాండ్‌లో లక్కీ డ్రాకు సంబంధించి ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్సులు

సద్వినియోగం చేసుకోండి..



గతంలో రాఖీ పండుగ సందర్భంగా మహిళా ప్రయాణికుల కోసం గతంలో లక్కీడ్రా నిర్వహించగా మంచి స్పందన వచ్చింది. ఇదే స్ఫూర్తితో దసరా పండుగ నేపథ్యంలో లక్కీడ్రా నిర్వహిస్తున్నాం. పదిమందికి ఒక్కక్కరికి రూ.10వేల చొప్పున బహుమతి అందజేస్తాం. భద్రాచలం ప్రజలు ఈ లక్కీ డ్రాలో విజేతలుగా నిలవాలని ఆశిస్తున్నా. ప్రతి ప్రయాణికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– రామారావు, ఆర్టీసీ డిపో మేనేజర్, భద్రాచలం

కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారు..

కరకగూడెం: రాష్ట్ర ప్రజలు సీఎం కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మండలంలోని అనంతారం గ్రామంలో సుమారు 50 కుటుంబాల వారు సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరగా ఆయన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అందిస్తున్న ప్రజా సంక్షేమా పథకాలకు ఆకర్షితులై ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నాన్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త బీఆర్‌ఎస్ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు చేయూత

బూర్గంపాడు: క్రీడాకారులకు ప్రభుత్వపరంగా, వ్యక్తిగతంగా అన్నివిధాల చేయూతనందించేందకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. మోరంపల్లిబంజర క్రికెట్ లీగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓ క్రీడా ఉపాధ్యాయుడిగా, ప్రభుత్వ ప్రతినిధిగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానన్నారు. ప్రభుత్వం ప్రతి గ్రామంలో క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేసి గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహన్నందిస్తుందన్నారు. క్రీడలు శారీరక దారుఢ్యం, మానసిక వికాసంతో పాటుగా జీవితంలో ఉన్నత లక్ష్యాలను అలవోకగా సాధించే శక్తినిస్తాయన్నారు. ఈ టోర్నీలో గెలిచిన డార్క్ ఎలెవన్ జట్టుకు, రన్నర్ జట్టు ఫ్రెండ్స్ యూత్ ఎలెవన్ జట్టుకు స్థానిక నేస్తం వేల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ అందించిన ట్రోఫీలను, నిర్వహక కమిటీ అందించిన నగదు బహుమతులను ఆయన అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, మేడం లక్ష్మీనారాయణరెడ్డి, ఖగేందర్‌రెడ్డి, బత్తుల రామకొండారెడ్డి, గాదె నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు ట్రోఫీలు అందిస్తున్న ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

కొలువులు సాధించిన వారికి సన్మానం..

మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన మేడం తేజేశ్వరరెడ్డి ఇటీవల ఎస్సై కొలువు సాధించాడు. అదే విధంగా గ్రామానికి చెందిన పేరం వెంకట్రామిరెడ్డి ఫైర్ కానిస్టేబుల్‌గా, మారుడి వెంకటేశ్వరరెడ్డి బెటాలియన్ కానిస్టేబుల్‌గా ఉద్యోగాలు సాధించారు. వీరిని మంగళవారం ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. లక్ష్యసాధన కోసం శ్రమించి విజయం సాధించిన ఈ ముగ్గురు మిగతా యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన పోలీస్‌స్టేషన్ ప్రారంభం

బూర్గంపాడు: మండల కేంద్రం బూర్గంపాడులో నిర్మించిన నూతన పోలీస్‌స్టేషన్‌ను విజయదశమి సందర్భంగా ఎస్సై రాజ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. వేదపండితులు పూజాకార్యక్రమాలు నిర్వహించి కొత్త పోలీస్‌స్టేషన్‌ను ఎస్సై రాజ్‌కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఎస్సైలు రాజ్‌కుమార్, నాగబిక్షం, పోలీస్‌సిబ్బంది పోలీస్‌స్టేషన్‌లోని తమకు కేటాయించిన సీట్లలో కూర్చుని వేదపండితుల ఆశీర్వాచనంతో పనులు ప్రారంభించారు. నూతనంగా ప్రారంభించిన పోలీస్‌స్టేషన్‌ను పాల్వంచ డీఎస్పీ వెంకటేష్ సందర్శించి ఎస్సైలను, సిబ్బందిని అభినందించారు.


నూతన పోలీస్‌స్టేషన్ ప్రారంభ కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది

చెత్తలోనే ఆస్పత్రి వ్యర్థాలు


భద్రాచలం కరకట్ట డంపింగ్ యార్డు వద్ద పడేసిన ఆస్పత్రి వ్యర్థాలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోగులకు ఉపయోగించి సిరంజ్, సెలైన్‌లు, రక్తపరీక్షలు కోసం రక్తాన్ని సేకరించే ప్లాస్టిక్ ట్యూబ్ వ్యర్థాలను గోదావరి నది ఒడ్డున ఉన్న డంపింగ్ యార్డు పక్కనే పడేస్తున్నారు. ఇప్పటికే భద్రాచలం పట్టణ ప్రజలు డంపింగ్ యార్డు సమస్యతో అనేక మంది అనారోగ్యానికి పాలవుతున్నారని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఇది చాలదంటూ ప్రైవేట్ ఆస్పత్రిల్లోని వ్యర్థాలను తీసుకొచ్చి డంపింగ్ యార్డులోనే పడేస్తున్నారు. వాస్తవానికి ప్రైవేట్ ఆస్పత్రిలో బయోవేస్ట్ మేనేజ్‌మెంట్‌కి సంబంధించి జిల్లా అధికారి పర్యవేక్షణలో నిత్యం ఈ వ్యర్థాలను సేకరించాల్సి ఉంటుంది. కాని ఇలాంటివి భద్రాచలంలో కనిపించడం లేదు. ప్రజల ఆరోగ్యాన్ని సంబంధిత అధికారులు గాలికి వదిలేసి, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయం జిల్లా స్థాయి వైద్య ఆరోగ్య శాఖ అధికారులక, స్థానిక గ్రామ పంచాయతీ అధికారులకు తెలియకుండానే జరుగుతుందా అనే విషయంపై ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఇలా ప్రైవేట్ ఆస్పత్రిలోని వ్యర్థాలను కరకట్ట వద్ద ఉన్న డంపింగ్ యార్డులో కాకుండా జిల్లా స్థాయిలో ఉన్న బయోవేస్ట్ మెనేజ్‌మెంట్ భాగంగా చెత్త నిర్వహణ చేపట్టలని, ఆ మేరకు పర్యావరణ పరిరక్షణ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.